# మెదడువాపు వ్యాధి

"మెదడువాపు వ్యాధి గురించి ముందుగానే జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధి గురించి భయం అవసరం లేదు" అని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డా॥సి.ఎస్.ఎన్.విఠల్ పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్ హోమ్‌లో శనివారం డా॥మారు అధ్యక్షతన జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని " మెదడువాపు వ్యాధి "గురించి ప్రసంగించారు. మెదడువాపు వ్యాధిగా పేర్కొనబడే జపనీస్ ఎన్‌కెఫలైటిస్ ఎక్కువగా అక్టోబరు, నవంబరు, డిశంబరు మాసాలలో ప్రబలుతుందని అన్నారు. అంటు వ్యాధిగా విస్తృతంగా ప్రబలే ఈ వ్యాధి క్యూలెక్స్ తరగతికి చెందిన దోమల ద్వారా వ్యాపిస్తుందన్నారు. జపనీస్ ఎన్‌కెఫలైటిస్ వ్యాధికి చెందిన ఫ్లావి వైరస్ పందుల్లో పెంపొందుతుందని అన్నారు. ఈ వైరస్ ఉన్న పందులని దోమల కుట్టి తిరిగి ఆ దోమలు మనుష్యులని కుడితే వ్యాధి సంక్రమిస్తుందన్నారు. జపనీస్ ఎన్‌కెఫలైటిస్ అనబడే మెదడువాపు వ్యాధి ముఖ్యంగా 15సం॥ల లోపు పిల్లల్లో వస్తుందన్నారు. వ్యాధి కారక క్రిములు పందుల్లోనే కాకుండా కొన్ని పక్షుల్లో, పెంపుడు జంతువుల్లోనూ ఉంటాయన్నారు. కాని వాటిల్లో చాలా తక్కువ శాతంలో వ్యాధి క్రిములు ఉండటం వల్ల వాటిని కుట్టిన దోమల ద్వారా వ్యాధి సంక్రమణ చాలా అరుదు అన్నారు. జపనీస్ ఎన్‌కెఫలైటిస్‌కి గురైన పిల్లవాడ్ని దోమ కుట్టి నేరుగా మరొక పిల్లవాడ్ని దోమ కుట్టినట్లైతే వ్యాధి సంక్రమించదన్నారు. పందులను కుట్టిన దోమల ద్వారానే వ్యాధి వస్తుందన్నారు. అందుకని జన నివాసాల దగ్గర పందులు లేకుండా చేసుకున్నట్లైతే దోమలు ఎంత కుట్టినా ఈ ప్రమాదకరమైన మెదడువాపు వ్యాధి రాదన్నారు. ప్రతి సంవత్సరం 50వేల మంది జపనీస్ ఎన్‌కెఫలైటిస్‌కి గురవుతున్నారు. వీరిలో 10-15వేల మంది మృత్యువాత పడుతున్నారన్నారు. ఈ వ్యాధికి గురైన వారిలో దాదాపు 30 శాతం మరణించగా మిగిలినవారు అంగవైకల్యాలు పొందడమో, మానసికంగా విలక్షణంగా మారడమో జరుగుతుందన్నారు. జపనీస్ ఎన్‌కెఫలైటిస్ వ్యాధి లక్షణాలు తీవ్రంగా ఉంటాయన్నారు. తీవ్రమైన జ్వరంతో వ్యాధి మొదలవుతుందన్నారు. తలనొప్పి, ఒళ్ళునొప్పులు, గొంతునొప్పి భరించలేనంతగా ఉంటాయన్నారు. వ్యాధి లక్షణాలు కనబడిన 1-2రోజుల్లోనే అపస్మారక స్థితి ఏర్పడుతుందన్నారు. ఫిట్స్‌రావడం, మెడ కండరాలు బిగదీసుకుపోవడం ఉంటాయన్నారు. వ్యాధి కలిగిన 3-4రోజుల్లోనే ప్రమాదస్థితికి చేరుతుందన్నారు. వ్యాధి క్రిములు శరీరంలో ప్రవేశించిన 4-14రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయన్నారు. జపనీస్ ఎన్‌కెఫలైటిస్ రాకుండా వ్యాక్సిన్ ఉందన్నారు.వ్యాక్సిన్ ఇప్పించిన కొద్ది దినాల్లోనే వ్యాధి నుంచి రక్షణ చేకూరుతుందన్నారు.అన్నింటికంటే ముఖ్యంగా వ్యాధి నివారణలో జన నివాసాలకి దూరంగా పందులని ఉంచడం అవసరం అన్నారు.